క్లుప్తంగా

నిబంధనలు పాటించండి

అయిజ: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ నరేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల సందర్భంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, బాణా సంచా కాల్చరాదని పేర్కొన్నారు. వ్యక్తులను కానీ, పార్టీలను కానీ, సంస్థలను కానీ ఎవరు కించపరిచి మాట్లాడకూడదని, ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యవహరించకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తరగతి గది ప్రారంభం



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి పునర్నిర్మించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ హైదరాబాద్‌లోని స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సేవా సంస్థను సంప్రదించగా వారు ముందుకొచ్చి పాఠశాల తరగతి గదిని నిర్మించగా శనివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛంద సంస్థతో కలిసి తరగతి గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, గ్రామ అధ్యక్షుడు వన్నప్ప, వెంకన్న, తిమ్మప్ప, ప్రకాష్, వీరన్న, బలరాం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించండి



అయిజ: పట్టణంలోని మడ్డి గుంత కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించకపోవడంతో కాలనీ ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీలో అటువైపు వెళ్లేవారు ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు ఉధృతిచెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. మడ్డి గుంత కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు ఎన్నిసార్లు కోరినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

గద్వాల అర్బన్: గద్వాల మండలంలో అనంతపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వెకిలి చేష్టలకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులైనా ఇటు ఉన్నతాధికారులు, అటు విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వెంటనే అతడిని విధుల్లో నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు కూలిన ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న వసతి గృహానికి ప్రహరీ కూలిపోవడంతో రాత్రివేళల్లో మందుబాబులు వసతి గృహంలోకి వెళ్లి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కూలిన ప్రహరీని నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరువురిపై దాడి కేసు నమోదు

ధరూరు: కాలనీలో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుతుండగా వారిపై మరో ఇద్దరు దాడి చేసిన ఘటనలో కేసు నమోదైన ఘటన శనివారం చోటుచేసుకుంది. రేవులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పేరు గ్రామానికి చెందిన బోయ సత్యమ్మ అదే గ్రామానికి చెందిన మాసిరెడ్డిలు శుక్రవారం సాయంత్రం 6గంటల సమయంలో కాలనీలో మాట్లాడుకుంటు ఉన్నారు. దీన్ని గమనించిన బోయ పెద్దసంజీవులు, బోయ చిన్న సంజీవులు అక్కడికి చేరుకొని ఎందుకు మాట్లాడుతున్నారని వారిపై దాడి చేశారు. శనివారం బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు.

పశువులకు షెడ్లులేక ఇక్కట్లు

- ఆర్థిక ఇబ్బందులతో పాకలు నిర్మించుకోలేని పరిస్థితి
- మూడు కాలాల్లో ఇబ్బందులు పడుతున్న పశువులు
- కొందరికి నిధులు మంజూరు.. మరికొందరికి రాలేదు..
- ఈ ఏడాది క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి అనుమతి రాలే..



పైపాడులో ఆరుబయట కట్టేసిన ఆవులు, ఎద్దులు

శాంతినగర్: పశువులకు రక్షణ కరువైంది. ఆవులు, ఎద్దులు, గేదెలకు సరైన రక్షణ, ఆవాసాలు లేకపోవడంతో మృత్యువాత పడుతూ రైతులకు నష్టం మిగిలిస్తున్నాయి. అనాదిగా వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ రోజురోజుకు అంతరించి పోతోంది. రైతులు, పాడి పోషకులకు ఆర్థిక స్థోమతలేక పశువులకు షెడ్లు నిర్మించుకోలేని పరిస్థితులున్నాయి. దీంతో ఎండ, వాన, చలికాలలకు పశువులు ఆరుబయట ఉండాల్సిన దుస్థితులు నెలకొన్నాయి.

కలగానే మిగిలింది..

పశువులకు షెడ్లు లేకపోవడంతో ఆరుబయటే ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గతంలో క్యాటిల్ షెడ్లు మంజూరు చేసి నిధులు ఇవ్వకపోవడంతో షెడ్ల నిర్మాణం కలగానే మిగిలిందని రైతులు వాపోతున్నారు. షెడ్లు నిర్మించుకుంటామని కోరినా అనుమతులు లేవని ఈజీఎస్ అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగాల బారిన పశువులు..

పశువులకు షెడ్లు లేకపోవడంతో ఎండా, వాన, చలి కాలలకు తరచు రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో విపరీతమైన వడగాలులకు, వర్షాకాలంలో తడుస్తూ రోగాలు వస్తున్నాయి.

దోమల ఉధృతితో..

ఆరుబయట పశువులు కట్టేయడంతో దోమలు, ఈగల బారిన పడుతూ రోగాల బారిన పడుతున్నాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల బారిన పడి తీవ్ర జ్వరాలతో పశువులు అస్వస్థతకు గురై మృత్యువాత పడుతున్నాయి.

సమాచారం లేక..

గ్రామీణ ప్రాంతాల్లో పశువులున్న యజమానులకు అప్పట్లో క్యాటిల్ షెడ్ల నిర్మాణం గురించి తెలియకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోయారు. తెలిశాక దరఖాస్తులు చేసుకుందామని వెళ్లితే కొత్తవి మంజూరు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో షెడ్లు నిర్మించుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023–24లోనైనా కొత్తగా క్యాటిల్ షెడ్లు మంజూరు చేసి పశువులకు రక్షణ కల్పించాలని ఈజీఎస్ అధికారులను రైతులు కోరుతున్నారు.

పాల దిగుబడి తగ్గిపోతోంది..



గేదెలను ఆరుబయట కట్టేస్తున్నందున దోమలు కుడుతూ పాల దిగుబడి తగ్గుతోంది. అంతేగాక తరచు జ్వరాల బారిన పడి గేదెలు మృతి చెందుతున్నాయి. షెడ్ వేసుకుందామంటే ఆర్థిక స్థోమతలేక ఆరుబయటే పశువులను ఉంచుతున్నాం. క్యాటిల్‌షెడ్ మంజూరు చేసి పాడి రైతులకు సాయం అందించాలి.

– రాంభూపాల్‌రెడ్డి, యాపదిన్నె

రోగాల బారిన పడుతున్నాయి..



లక్షలు పెట్టి ఎద్దులను తెచ్చుకుని వ్యవసాయం చేస్తున్నాం. ఎద్దులు కట్టేయడానికి షెడ్డు లేదు. ఆరుబయట చెట్ల కింద కట్టేస్తున్నాం. గతంలో షెడ్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. మంజూరు కాలేదు. ఈ సారైనా క్యాటిల్‌షెడ్ మంజూరు చేస్తే ఎద్దులకు రక్షణ కల్పిస్తాం.

– భాస్కర్, యాపదిన్నె

ఆదేశాలు వస్తే దరఖాస్తులు తీసుకుంటాం..



గతంలో ఈజీఎస్ పథకంలో క్యాటిల్ షెడ్లు మంజూరు కావడంతో కొందరే నిర్మించుకున్నారు. మరి కొందరు నిర్మించుకోలేదు. అప్పట్లో నిర్మించుకున్న వారికి బిల్లులు చేశారు. ఈ ఏడాది క్యాటిల్ షెడ్ల నిర్మాణం గురించి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే దరఖాస్తులు స్వీకరించి మంజూరు చేస్తాం.

– రవీంద్ర, ఎంపీడీఓ, వడ్డేపల్లి

గట్టుపై పట్టెవరికో?



బల్గెర గ్రామం

- ఆయా గ్రామస్తుల మెజార్టీ తీర్పు ఎటు వైపు
- అంచనాల్లో పార్టీల నేతలు

గట్టు: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియగా మండలంలోని మెజార్టీ గ్రామాల ప్రజలు ఎటు వైపు మొగ్గు చూపారనే దానిపై గ్రామాల్లో జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. గట్టుపై ఎవరు పట్టు సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో పట్టు సాధించిన నాయకులు అదే పట్టును కొనసాగిస్తారా లేక పట్టును కోల్పోతారా? అనేది తేలాల్సి ఉంది. బీఆర్‌ఎస్‌తో పాటుగా కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు గట్టుపై పట్టును సాధించేందుకు శతవిధాల ప్రయత్నాలు చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 46,773 మంది ఓటర్లకు గాను 39,523 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.50 శాతం ఓటింగ్ నమోదైంది. గతంతో పోల్చుకుంటే ఈ సారి మండలంలో ఓటింగ్ శాతం పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మండలంలో మెజార్టీ గ్రామాలైన గట్టు, మాచర్ల, బోయలగూడెం, ఇందువాసి, చాగదోణ, మిట్టదొడ్డి, తుమ్మలపల్లి, గొర్లఖాన్ దొడ్డి, ఆరగిద్ద, పెంచికలపాడు, ఆలూరు, తుమ్మలచెరువు గ్రామాల ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారనే ఆసక్తికర చర్చలు గ్రామాల్లోని టీ కొట్టు దుకాణాల్లో, రచ్చకట్టల దగ్గర కొనసాగుతున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర గ్రామానికి చెందిన బోయ శివారెడ్డి పోటీలో ఉన్నారు. బోయ శివారెడ్డి తన సామాజిక వర్గంతో పాటుగా ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఎంత మంది ఓటర్లపై ప్రభావం చూపుతారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఏఐఎఫ్‌బీపీకి చెందిన రంజిత్‌కుమార్ పక్క మండలం చింతలకుంట. రంజిత్‌కుమార్ కూడా ఎంత వరకు ఓటర్లను తన వైపు తిప్పుకుంటారనేది ఆసక్తిగా మారింది. ఇక ప్రధాన పార్టీలకు చెందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సరితలకు చెందిన అనుచరులు ప్రతి గ్రామంలో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు చివరి దాకా విశ్వప్రయత్నాలు చేశారు. ఓటర్లకు ఎవరి వైపు మొగ్గు చూపారనేది తేలాల్సి ఉంది.

ఎన్నికల ఫలితాలపైనే చర్చ

- గెలుపోటములపై ముచ్చట
- ఎక్కడా చూసిన ఇదే తీరు



కేటీదొడ్డిలో నేడు వెలువడే గెలుపు ఓటమిపై టీస్టాల్ దగ్గర మాట్లాడుకుంటున్న ప్రజలు

కేటీదొడ్డి: ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. మండలంలోని ఏ గ్రామంలో చూసినా జనాలు గుమికూడి గెలుపోటములపైనే శనివారం చర్చ చేస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద, పంట పొలాల్లో చెట్లకింద, టీస్టాళ్లు, హోటళ్లు, కార్యాలయాల్లో దుకాణ సముదాయాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపై దృష్టి పెట్టారు. ప్రధాన పార్టీ గెలుస్తుందని, లేదు లేదు ఈ పార్టీ గెలుస్తుందని చర్చలు సాగుతున్నాయి. మొదటి నుంచి ఆ పార్టీ ప్రచారం బాగా చేసింది. కాని డబ్బులు ఇవ్వకపోవడంతో వెనుకబడిందని కొందరికి ఇచ్చి మరోవాడలో ఎక్కువ ఇచ్చారని చర్చ జరుగుతోంది. దీంతో పాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వారు 'మీ నియోజకవర్గం ఎట్లుంది. ఎవరు గెలుస్తారు' అని ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువులకు ఫోన్లు చేసి మరి తెలుసుకుంటున్నారు. గురువారం సాయంత్రం నుంచి టీవీల్లో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు పార్టీల ఫలితాలు వెల్లడించాయి. వాటి ఆధారంగా కొందరు పార్టీ చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు, తదితర ఆధారంగా గెలుపోటములను అంచనాలు వేసుకున్నారు.

మొన్నటి వరకు ప్రచారం..

మొన్నటి వరకు గ్రామాల్లో పట్టణాల్లో ఎన్నికలు అభ్యర్థుల ప్రచార రథాలు, సభలు, సమావేశాలు ర్యాలీలు, వీధుల్లో తిరుగుతూ ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల ముందు రోజురాత్రి పంపకాలపై చర్చ జరుగుతూ పోలింగ్ ముగిసింది. కార్యకర్తలు గల్లీ లీడర్లు ఇప్పుడు గెలుపు ఓటములపై బేరసాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితాలు ఇలా ఉంటాయనే ఆలోచనలో ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ధరూరులో ర్యాలీ

ధరూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రమైన ధరూరులో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓఎంఐఎఫ్ సంస్థ ప్రధానంగా ఎయిడ్స్, జోగినీలు, ఒంటరి మహిళల కోసం పని చేస్తుందన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలకు కుట్టుమిషన్, బ్యూటీషియన్, కంప్యూటర్ వంటి కోర్సులను ఉచితంగా నేర్పించి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చేలా పని చేస్తుందన్నారు. ఎంఎల్‌టీ వంటి కోర్సులను నేర్పించడం జరుగుతందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వజ్రమ్మ, ఆశా వర్కర్ సమితలను శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎంఐఎఫ్ కో ఆర్డినేటర్ అనురాధ

టీఆర్‌టీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదో పటాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్ హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ నాయకులు, తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ టోర్నమెంట్

శాంతినగర్: ఎన్నికల హడావిడితో మూడు నెలలపాటు శ్రమించిన కార్యకర్తలు, నాయకుల ఉల్లాసం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ కొనసాగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్‌తో పాటు కొడుకు దీపక్‌ప్రజ్ఞ క్రికెట్ ఆడారు. భార్య మహాలక్ష్మి, కూతురు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

ధరూరు: అసెంబ్లీ ఎన్నిల ఫలితాల నేపథ్యంలో ఆదివారం మండలంలో విజయోత్సవ ర్యాలీలకు, సౌండ్‌కు గానీ అనుమతి లేదని ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పైవాటికి అనుమతుల్లేవన్నారు. ర్యాలీలు చేయాల్సివస్తే రిటరి్నంగ్ ఆఫీసర్ (ఆర్‌ఓ)అనుమతి తీసుకుని చేయాలని, అనుమతులు లేకుండా చేస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మహిళా చట్టలపై అవగాహన



మానవపాడు పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో నిర్వహిస్తున్న సిబ్బంది

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీ గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ జ్యోత్స్న మాట్లాడారు. ఆహార, పోషకాహారం న్యూట్రీషన్, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలని కోరారు. బాలలకు హక్కులకు ఆటంకలు వాటిల్లితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

- సర్వసభ్య సమావేశంలో డిమాండ్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఉండవెల్లి: రైతులకు పంటల పరంగా దిగుబడులు లేక, వర్షాలు రాకా ఇబ్బందులు పడుతున్నారని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు ఉన్నతాధికారులకు తెలపాలని వైస్ ఎంపీపీ దేవన్న అధికారులతో తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీపీ బీసమ్మ, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు కోరం ఉన్నా అడగటానికి సర్పంచు ఒక్కరే ఉండడంతో సమస్యలపై ప్రశ్నలు రాలేదు. అధికారులు పాల్గొనాల్సిన తరుణంలో ముగ్గురే రావడంతో, అధికంగా సిబ్బంది ఉన్నారు. ఏఓ సురేఖ మాట్లాడుతుండగా మండలాన్ని కరువు మండలంగా గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని వైస్ ఎంపీపీ దేవన్న కోరారు. దీంతో ఉన్నతాధికారులకు తెలపుతామని పేర్కొన్నారు. సర్పంచు లోకేశ్వర్ రెడ్డి ఏపీఓను గ్రామ పంచాయతీ బిల్లులపై ఆరా తీయగా, ఏపీఓ సానుకూలంగా స్పందించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు లేకుండా పనులు ఎలా అవుతాయని ప్రశ్నించగా, ఎలక్షన్ విధులకు వెళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



అయిజలో నిలిచిపోయిన వాహనాలు

అయిజ: పట్టణంలో పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసినా అది ఊరుబయట చాలా దూరంగా ఉండడంతో ప్రజలు ఆ రోడ్డుపై వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు. పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ నుంచి పశువుల ఆస్పత్రి ముందు నుంచి కొత్త బస్టాండ్ వెళ్లే రోడ్డు చాలా ఇరుకుగా ఉండడంతో ప్రతిరోజు అనేకసార్లు ట్రాఫిక్ జామ్ అవుతోంది. దాని వల్ల అత్యవసర పనులపై వెళ్లేవారు, ఆస్పత్రులకు వెళ్లే వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు, చిన్న ఆటోలను మాత్రమే ఆరోడ్డు మార్గం నుంచి అనుమతించాలని, పెద్ద వాహనాలను ఊరి బయట ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రోడ్డుపై వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



నాగర్‌దొడ్డి సమీపంలో కల్వర్టు వద్ద సూచికబోర్డు లేని దృశ్యం

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టుకు సూచిక బోర్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కల్వర్టు సమీపంలో ఎలాంటి సూచికబోర్డులను ఏర్పాటు చేయలేదని వారు ఆరోపించారు. ప్రతినిత్యం వందలాది వాహనదారులు ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాత్రివేళలో కల్వర్టు సమీపంలో ఉన్న గుంత కనిపించక అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు సమీపంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో నాగప్రతిష్ఠ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాగిచెట్టుకు, వేప చెట్టుకు కల్యాణం నిర్వహించి నాగప్పల జంట విగ్రహాన్ని అర్చకులు ప్రతిష్ఠించారు. వేద మంత్రాలతో యాగం నిర్వహించి కల్యాణం చేశారు. అర్చకులు వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో నాగప్పల జంటను ప్రతిష్ఠించిన అర్చకులు

అమ్మవారి కలశాల ఊరేగింపు

- కుంభం కాగులతో మొక్కుల చెల్లింపు
- గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పణ
- వైభవంగా ప్రభోత్సవం



అమ్మవారి గర్భగుడి అలంకరణ



గట్టులో అమ్మవారి ప్రభోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

గట్టు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంబా భవానీ మాత జాతర సందర్భంగా రెండో రోజు శనివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 11గంటలకు గ్రామంలో ఉన్న చౌడమ్మ దేవాలయం నుంచి అమ్మవారి కలశాలను ఎస్‌ఎస్‌కే సమాజ్ వారు ఊరేగింపుగా సంత బజారులోని భవానీ మాత ఆలయం వరకు తీసుకు వచ్చారు. అనంతరం అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మండల ప్రజలు పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. కొందరు భక్తులు కుంభం కాగుతో అమ్మవారితో పాటుగా పెద్దమ్మవ్వ, గొకరమయ్యకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా గ్రామ సరిహద్దుల్లో వెలిసిన దేవతలకు భక్తులు నైవేద్యాలు సమర్పించారు. జాతర సందర్భంగా బంధుమిత్రులతో గ్రామం కళకళలాడుతోంది. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తులకు అన్నదానం..

రథోత్సవాన్ని పురస్కరించుకుని భవానీ ఆలయం దగ్గర భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా కొడుమూరుకు చెందిన బసోది వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు దేవాలయం దగ్గర భక్తులకు అన్నదానం నిర్వహించారు. కర్నూలు జిల్లా కొడుమూరుకు చెందిన భక్తుడు గట్టు అంబా భవానీ దేవాలయం దగ్గర భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా ప్రభోత్సవం..

జాతర సందర్భంగా శుక్రవారం రాత్రి 11.30 గంటలకు ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్న రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఎంతో ఉత్సాహంగా చిన్నరథాన్ని భక్తులు లాగారు. అమ్మవారు ఆశీనులైన చిన్న రథాన్ని ఆలయం నుంచి ఊర చావిడి దగ్గరున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఎస్‌ఎస్‌కే (క్షత్రియ సంఘం) సమాజ్ వారు ఊరేగింపుగా దేవాలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రభోత్సవంపై ఏర్పాటు చేసి, రథాన్ని భక్తితో లాగారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం సభ్యులు పాపురం వెంకటేష్, ఈరన్న, చంద్రమోహన్, వినోద్ పాటుగా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.